క్లుప్తంగా

ట్రేడ్ లైసెన్సులు రెన్యువల్ చేసుకోవాలి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో వ్యాపారులు వీఎంసీకి చెల్లించాల్సిన ట్రేడ్ లైసెన్సులను ఈ నెలఖరులోగా రెన్యువల్ చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీ లోగా రెన్యువల్ చార్జీలు చెల్లించేవారికి ఎలాంటి అపరాధ రుసుం ఉండదన్నారు. రెన్యువల్స్‌ను నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలోని వీఎంసీ క్యాష్ కౌంటర్లలో, వార్డు సచివాలయాల్లో చెల్లించవచ్చన్నారు. రెన్యువల్స్ మార్చి 1వ తేదీ నుంచి 31వ తేదీ లోగా చేసుకుంటే చార్జీల్లో 25శాతం, ఏప్రిల్ 1 నుంచి 30 తేదీలోగా రెన్యువల్స్ చేసుకుంటే రెన్యువల్ ఫీజులకు 50 శాతం అపరాధ రుసుంగా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

అయ్యప్ప మందిరంలో ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్ప స్వామి మందిరంలో బుధవారం మాఘమాసం పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. గురుస్వామి స్వామివారికి పంచామృత అభిషేకం, విశేష అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం భక్త బృందం ఆధ్వర్యంలో అయ్యప్ప భజన కార్యక్రమం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పేదలకు అన్నదానం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆపదలో ఉన్న నిరుపేదలకు అండగా నిలవడమే కళ్లే లలితా చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని ట్రస్ట్ అధ్యక్షులు కళ్లే నాగేశ్వరరావు అన్నారు. సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద కళ్లే లలితా ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ లక్ష్యాలను, సేవా కార్యక్రమాలను వివరించారు. రానున్న రోజుల్లో తమ సేవలను మరింత విస్తరిస్తామన్నారు. ట్రస్ట్ డైరెక్టర్లు కళ్లే సీతా మహాలక్ష్మి, ముప్పూరి హరీష్, ట్రస్ట్ సభ్యులు ఎం.జశ్విన్, జి.ధ్రువన్ పాల్గొన్నారు.

రేపు స్కిల్ ఫెస్ట్-2025

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా ఈనెల 14 తేదీ తమ స్కూల్ ఆవరణలో స్కిల్ ఫెస్ట్-2025 పేరుతో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని వీరమాచినేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి పలు ప్రాజెక్టు నమూనాలు, సైన్స్, సోషల్ అంశాలకు సంబంధించిన నమూనాలు, త్రీడి చిత్రాల నమూనాలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లను ప్రదర్శిస్తారని వివరించారు.

ఎస్ఆర్ఆర్‌లో తెలుగు పరిచయం కోర్సు ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం తెలుగు పరిచయం కోర్సు ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ స్థానిక ఆడిట్, ఏ అండ్ ఇ శాఖలలో ఆడిటర్లుగా పని చేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, తెలుగేతర రాష్ట్రాలకు చెందిన వారు తప్పనిసరిగా తెలుగు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుందన్నారు. వారి సౌలభ్యం కోసం తాము తెలుగు పరిచయం కోర్సును ఏర్పాటు చేసి 48 రోజులలో రోజుకు రెండు గంటల చొప్పున తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. 48 రోజుల తరువాత పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్‌లు అందజేస్తామన్నారు. సీనియర్ ఆడిట్ ఆఫీసర్ ఆర్. సుజాత, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఎల్ ఆర్ సత్య, కళాశాల అధ్యాపకులు మాట్లాడారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పనికని వెళ్లిన ఓ మహిళ తిరిగి ఇంటికి రాలేదు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ రాజరాజేశ్వరిపేటకు చెందిన మహిళ తొమ్మిదేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త పెయింటింగ్ పనులు చేసుకుంటుండగా ఆమె వారి ఇంటి సమీపంలోని ఓ కిరాణా షాపులో పనిచేస్తుంటోంది. రోజులానే ఈ నెల 10వ తేదీన పనికని వెళ్లిన ఆమె రాత్రి తొమ్మిది గంటలైనా ఇంటికి రాలేదు. భర్త, కుటుంబ సభ్యులు ఆమెకు ఫోను చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. వారు షాపు వద్ద, స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినప్పటికి ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడేళ్లుగా పిల్లర్ల దశలోనే!

- రూ. 80 లక్షలతో కల్యాణ మండపం పనులు ప్రారంభం
- రూ. 30 లక్షలతో పిల్లర్ల దశకు వచ్చి నిలిచిన పనులు
- పిచ్చిమొక్కలతో నిండిన ఆవరణ
- పనులు పూర్తి చేయాలని స్థానికుల వినతి



తుప్పపడుతున్న పిల్లర్లు. పిచ్చిమొక్కలతో నిండిన ఆవరణ

పాయకాపురం(విజయవాడరూరల్): రాజీవ్‌నగర్, సుందరయ్య నగర్, కొత్త రాజీవ్‌నగర్ పరిసర ప్రాంతాల పేదలు శుభ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా కల్యాణ మండపం నిర్మించాలని 2018లో అప్పటి ప్రభుత్వం పనులు ప్రారంభించింది. ఇందుకోసం రూ. 80 లక్షలు మంజూరు చేసింది. సుమారు ఏడేళ్ల కిందట అప్పటి టీడీపీ ప్రభుత్వం రాజీవ్‌నగర్ నగర్‌లోని కమ్యూనిటీ స్థలంలో కల్యాణ మండపం పనులు ప్రారంభించింది. పనులు పూర్తయి కల్యాణ మండపం అందుబాటులోకి వస్తుందని స్థానికులు ఎంతగానో ఆశపడ్డారు. పనులు పిల్లర్ల దశకు రాగానే నిలిచిపోయాయి. నిధులు ఉండి కూడా నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. పిల్లర్లు తుప్పు పట్టిపోతుండగా ఆవరణ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. సంవత్సరాలు గడుస్తున్నా కల్యాణ మండపం నిర్మాణం పూర్తికాలేదు. ముళ్ల పొదలు, తుప్పల మధ్య పాడుపడిన కట్టడాలు తుప్పు పట్టి కనిపిస్తున్నాయి. పేదల పట్ల టీడీపీ పాలకులకు ఉన్న ఆసక్తికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

పిల్లర్ల దశలో ఉన్న ఈ ప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళల్లో గంజాయి సేవించే వారు, పేకాట ఆడేవారికి స్థావరంగా ఇది మారింది. గంజాయి సేవించే వారిని, మద్యం సేవించే వారిని, పేకాడేవారిని అరికట్టాలని పోలీసులకు, పాలకులకు స్థానికులు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకపోయింది. 1992లో ఆ పరిసర ప్రాంతాల్లో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలను ఇచ్చారు. వారి అవసరాల నిమిత్తం కేటాయించిన కామన్ స్థలం నిరుపయోగంగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యలో నిలిచిపోయిన కల్యాణ మండపం పనులను తిరిగి ప్రారంభించి పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. కల్యాణ మండపం నిర్మిస్తే పాత, కొత్త రాజీవ్ నగర్ పరిసర ప్రాంతాల్లో నివసించే కుటుంబాల వారు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అంటున్నారు.

మద్యం మత్తులో ఘర్షణలు

కమ్యూనిటీ స్థలం ఖాళీగా ఉండటం వల్ల రాత్రి సమయాల్లో ఆటోలను పెట్టుకొని అందులోనే మద్యం సేవిస్తున్నారు. వీరు మద్యం మత్తులో గొడవలు పడి స్థానికులకు అసౌకర్యం కలిగిస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి కల్యాణ మండపం నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రారంభించి.. వదిలేశారు.



రాష్ట్ర విభజన జరిగిన తర్వాత అధికారం చేపట్టిన టీడీపీ రాజీవ్ నగర్‌లోని కమ్యూనిటీ స్థలంలో కల్యాణ మండపం నిర్మించేందుకు పనులు ప్రారంభించి వదిలేసింది. కల్యాణ మండపం పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– సంపత్, రాజీవ్‌నగర్

నిర్మాణం పూర్తి చేయాలి



సంవత్సరాల తరబడి ఈ స్థలంలో కల్యాణ మండపం నిర్మించాలని కోరుతున్నాం. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మిగిలిన పనులు పూర్తి చేసి మాకు ఉపయోగపడే విధంగా కల్యాణ మండపాన్ని అందుబాటులోకి తేవాలి.

–రాజు, రాజీవ్ నగర్

ఘనంగా మాఘ పౌర్ణమి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గాజుల ఉత్సవం..

మధురానగర్‌లోని బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారికి గాజుల ఉత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం మొత్తం వివిధ రకాల గాజులతో అలంకరణ చేసి అమ్మవారి ని గాజులతో విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు రంగావఝల ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు బోయిన గోపాలకృష్ణమూర్తి, హరి కృష్ణ దంపతులు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ముత్యాలంపాడులో..

ముత్యాలంపాడులోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి కుంకుమార్చనలు శ్రీచక్రార్చనలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు డి. వెంకట నరసింహారాజు పర్యవేక్షించారు.

శ్రీ శివజ్ఞాన పీఠంలో..

శ్రీ శివ జ్ఞానపీఠంలో సూర్య భగవానుడికి లక్ష తామర పూస పూజ (లక్ష పద్మ బీజార్చన) జరిగింది. పీఠాధిపతి శివాచార్య స్వామి సూర్యభగవానునికి విశేషంగా పూజలు, అర్చనలు సూర్య నమస్కారాలు నిర్వహించారు. మాఘ పూర్ణిమ విశిష్టతను వివరించారు. వెంకట నాగ శివప్రసాద్, వెంకట నాగ ప్రవీణ్ కుమార్ దంపతులు పూజలు చేశారు.



శివజ్ఞాన పీఠంలో పూజలు



బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గాజుల అలంకరణలో అమ్మవారు

దురలవాట్లకు దూరంగా ఉండాలి

ఏసీపీ లలితకుమారి

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణ కలిగి ఉన్నత చదువులు చదువుకోవాలని ఏసీపీ లలితకుమారి అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ లో విద్యార్థులతో బుధవారం ఆమె కొద్ది సేపు ముచ్చటించారు. ఆమె మాట్లాడుతూ మంచి లక్షణాలు ఏ విధంగా ఉంటాయి, చెడు స్నేహాలను ఏ విధంగా దూరంగా ఉంచాలి అనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా వుండాలని, చెడు స్నేహాలను వదిలివేసి క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లలో వస్తున్న అన్నిరకాల యాప్స్‌కు దూరంగా ఉండి మంచి ప్రవర్తనతో తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనాలు నడపడంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానోపాధ్యాయులు డాక్టర్ మైనం హుస్సేన్, ఉపాధ్యాయులు రేణుక, ఉదయలక్ష్మి, అనిత, నళిని,గణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ లలితకుమారి

ఆ కాఫీ షాపును తొలగించండి

విజయవాడస్పోర్ట్స్: స్థానిక నక్కలరోడ్డులోని ఆంధ్రా హార్ట్, బ్రెయిన్ ఆస్పత్రి వద్ద ఉన్న కాఫీ షాపు కారణంగా ఆ రోడ్డులో తరుచూ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మధురానగర్‌కు చెందిన యు.రవితేజ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. బిల్డింగ్ సెట్‌బ్యాక్‌ను ఆక్రమించి మునిసిపల్ బిల్డింగ్ రూల్స్‌కు వ్యతిరేకంగా కాఫీ షాపును ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. షాపునకు వచ్చే కస్టమర్స్ వారివారి వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేయడం వల్ల ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది తలెత్తుతోందని, ట్రాఫిక్ సమస్య తీవ్రతరం అవుతోందని, దీనిపై వెంటనే స్పందించి చర్యలు తీసుకుని ప్రజాప్రయోజనాలను కాపాడాలని అధికారులను కోరారు.

దుర్గగుడికి కొత్త హుండీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో కొత్త హుండీలను ఏర్పాటు చేసేందుకు ఈవో రామచంద్రమోహన్ చర్యలు తీసుకుంటున్నారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంతో పాటు ఆలయ ప్రాంగణంలోని దత్తత దేవాలయాల్లో ఇప్పటి వరకు రౌండ్ షేప్‌లో ఉన్న హుండీలను ఏర్పాటు చేశారు. అయితే ఆలయానికి భక్తుల తాకిడి పెరగడం, క్యూలైన్‌లో రౌండ్ హుండీలతో భక్తులు త్వరగా ముందుకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రౌండ్ హుండీల స్థానంలో బాక్స్ టైప్ హుండీలను ఏర్పాటు చేయడం వల్ల ఇబ్బందులు తొలగుతాయని బావించి తొలి దశలో నాలుగు హుండీలను తయారు చేయించారు. వాటిని క్యూలైన్‌లో ఏర్పాటు చేసిన తర్వాత భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుంటే మరిన్ని తయారు చేయించే అవకాశం ఉందని ఆలయ ఇంజనీరింగ్ విభాగ అధికారులు పేర్కొంటున్నారు.



ఈఓ చాంబర్ వద్ద ఉంచిన కొత్త హుండీలు

వైభవంగా స్వామి వారి కల్యాణం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం వార్షిక ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారి కల్యాణ మహోత్సవం, పవళింపు సేవ జరిగింది. కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శివుని రూపంతో బొమ్మగీసి సూర్య నమస్కారాలు చేశారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఆలయ ఈఓ వై. సీతారామయ్య ప్రసాద వితరణ చేశారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈనెల 6 నుంచి 9 వరకు శ్రీకాకుళంలో రాష్ట్ర 22వ మహాసభలు జరిగాయి. మహాసభల తీర్మానాలను, నూతన కార్యవర్గ వివరాలను బుధవారం విజయవాడ సీపీఐ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎం. యుగంధర్ (శ్రీకాకుళం), రాష్ట్ర కార్యదర్శిగా పరుచూరి రాజేంద్రబాబు (ఎన్టీఆర్ జిల్లా), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి. సంతోష్ కుమార్ (అనంతపురం), ఉపాధ్యక్షులుగా వై బాబీ (కాకినాడ), కె. శ్రీనివాసులు (కర్నూలు), సీహెచ్ గీత (కాకినాడ), పి. ప్రభాకర్, (ప్రకాశం), సహాయ కార్యదర్శులుగా షేక్ సుభాని (పల్నాడు), జి. నాగరాముడు (నంద్యాల), కత్తి రవి (తిరుపతి), కోశాధికారిగా వై. రాంబాబు (విశాఖపట్నం) ఎన్నికయ్యారని పరుచూరి రాజేంద్ర తెలిపారు.

వ్యక్తికనిపించడం లేదని ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం బర్మా కాలనీకి చెందిన లోలుగు శ్రీనివాసరావు (38) రెండు రోజులుగా కనిపించడం లేదు. బర్మా కాలనీలో వెల్డింగ్ పనిచేస్తూ జీవిస్తున్న ఆయన మంగళవారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లిన తిరిగి రాలేదు. పోలీసులు నున్న పోలీసులు కేసు నమోదు చేశారు.

మతిస్థిమితం లేని మహిళ..

పాయకాపురం(విజయవాడరూరల్): మతి స్థిమితం లేని షేక్ బీబీ (42)అనే మహిళ ఈ నెల 10వ తేదీ నుంచి కనిపించడం లేదు. శాంతినగర్ మసీదు సెంటర్‌కు చెందిన ఆమె మతి స్థిమితం సరిగా ఉండకపోవడంతో సొంత గ్రామమైన మార్కాపురంలో పెద్ద కొడుకు వద్ద ఉండేది. పది రోజుల కిందట ఆమె భర్త బీబీని శాంతినగర్‌కు తీసుకువచ్చాడు. అప్పటి నుంచి బీబీ తన భర్తను చూసి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతుండగా భర్త ఆమెకు కనిపించకుండా మసీదులో ఉంటున్నాడు. ఈనెల 10వ తేదీన ఇంటికి వెళ్లి చూడగా ఆమె కనిపించలేదు. భర్త షేక్ బాజీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆధ్యాత్మిక ప్రవచనాలతో సామాజిక మార్పు

ఆధ్యాత్మిక వేత్త మల్లాది వెంకట రామనాథ శర్మ



విజయవాడ కల్చరల్: పంచమవేదం మహాభారతమని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త మల్లాది వెంకట రామనాథ శర్మ అన్నారు. శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి వర్ధంతి సందర్భంగా దుర్గాపురంలోని శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిగా సాగుతున్నాయి. బుధవారం నాటి కార్యక్రమంలో మహాభారతంలోని పలు ఘట్టాలను వివరించారు ఆయన మాట్లాడుతూ మహాభారతం భారతీయ ఆధ్యాత్మిక ప్రపంచంతో ధృవతారగా నిలచి పోయిందన్నారు. పురాణాల ప్రవచనాల వల్ల సమాజంలో అనేక మార్పులు కలుగుతాయని చెప్పారు. అనాదిగా గ్రామాలలో పురాణాల ప్రవచనాలు మహావైభవంగా జరిగేవన్నారు. నేడు ప్రసార మాధ్యమాల వల్ల విస్తృతమయ్యాయని చెప్పారు. ఉదయం దేవాలయ సముదాయంలో చండీ పారాయణం, నవ చండీ హోమం, దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరగాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ప్రతి రోజూ ఇంటింటి నుంచి సేకరించిన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరగాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం కొత్తవంతెన జంక్షన్, సాంబమూర్తి రోడ్డు, అజిత్ సింగ్‌నగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణలో ఎటువంటి లోపం తలెత్తకూడదన్నారు. సేకరించిన వ్యర్థాలను క్రమం తప్పకుండా గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల ద్వారా నిర్వహణ జరగాలని చెప్పారు. వ్యర్థాల నుంచి ఎరువులు తయారు చేసే ప్రక్రియ, పూల వ్యర్థాల నుంచి అగరవత్తులు చేసే ప్రక్రియ, కొబ్బరి బొండాల వ్యర్థాల నుంచి కొబ్బరి పీచు దాని ఉత్పత్తుల తయారీ ప్రక్రియ నిత్యం జరగాలని అధికారులను ఆదేశించారు. చీఫ్ సిటీ ప్లానెటర్ జీవీజీ ఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, సూపరింటెండింగ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) పి. సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

అవకతవకలపై విద్యుత్ విజిలెన్స్ ఆరా

- బాధితుల ఇళ్లకు వెళ్లి వాస్తవాలు తెలుసుకున్న సిబ్బంది
- వినియోగదారులకు ఫోన్లు చేసి బతిమాలుకుంటున్న ఓ అధికారి

సాక్షి ఎఫెక్ట్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న అవినీతి దందాపై విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలో దోపిడీకి గురవుతున్న వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ ఈ నెల 11న ‘మీటర్‌కో రేటు.. స్తంభానికో రేటు’ శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి విజిలెన్స్ అధికారులు స్పందించారు. బుధవారం సింగ్‌నగర్‌లోని పలువురు బాధితుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. తమ ఇళ్లకు కొత్త మీటర్లు వేసేందుకు ఎంతెంత తీసుకున్నారనే విషయాలను తెలుసుకునేందుకు వచ్చిన సిబ్బంది స్థానిక వినియోగదారులు చెప్పిన మాటలు విని నివ్వెరపోయారు. ఓ వినియోగదారుడు తాను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే తనను పది రోజుల పాటు కార్యాలయం చుట్టూ తిప్పుకొని మీటర్‌కు రూ.15 వేలు కట్టించుకున్నాడని తెలుపగా.. మరో వినియోగదారుడు మూడు మీటర్లకు చలానాలు కాకుండా రూ.75 వేలు చెల్లించినట్లు అధికారులకు తెలిపారు. మరికొంతమంది వినియోగదారులు తాము మీటర్‌కు రూ.10 వేలు, విద్యుత్ స్తంభాలు వేసేందుకు రూ.2.50 లక్షల వరకూ ఇచ్చారని చెప్పారు. అయితే పోలీసు డ్రెస్‌లో వచ్చి తమను రిపోర్ట్ ఇవ్వమని అడగడంతో కొంతమంది వినియోగదారులు ఫిర్యాదులు రాసిచ్చేందుకు నిరాకరించారు. మేము అలా ఇవ్వాలంటే నేరుగా ఏసీబీకే ఫోన్లు చేసి ఇచ్చేవాళ్లం కదా.. వీళ్లు ఇలా ఎంక్వైరీ చేయడం కన్నా ఈ రెండు నెలల్లో ఈ సబ్‌స్టేషన్ పరిధిలో ఎన్ని కొత్త మీటర్లు అమర్చారు.. ఎన్ని స్తంభాలు వేశారు.. ఎన్ని ట్రాన్స్‌ఫార్మర్లు వేశారో తెలుసుకుని వారితో మాట్లాడితే అన్ని విషయాలు వెల్లడవుతాయి కానీ, ఇలా పేపర్లపై రాసి ఫిర్యాదులు అందిస్తే రేపు వారు మా సర్వీసులు నిలిపివేసి ఇబ్బందులకు గురిచేస్తారని భయపడుతున్నారు. మేము అదనంగా డబ్బులిస్తేనే తప్ప మాకు మీటర్లు, స్తంభాలు వేయడం లేదని.. ఏ వినియోగదారుడిని కదిలించినా.. ఇక్కడ ఏ బిల్డర్లను అడిగినా వాస్తవాలన్నీ వెలుగులోకి వస్తాయని తెలుపుతున్నారు.

విజిలెన్స్ వాళ్లు కూడా మా వాళ్లే అంటూ ఫోన్లు..

మీ దగ్గర డబ్బులు తీసుకున్నట్లు ‘సాక్షి’ వారికి ఎలా తెలిసింది.. సరే ఇప్పుడు మీ వద్దకు విజిలెన్స్ వాళ్లు వచ్చి అడుగుతారు.. వాళ్లు కూడా మా వాళ్లే.. ఏమీ లేదు.. ఏమీ తీసుకోలేదని చెప్పండి.. సరేనా’... అంటూ సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఓ అధికారి కొంతమంది వినియోగదారులకు బుధవారం ఫోన్లు చేసి బతిమాలుకున్నారు. ఇవన్నీ మాకు ‘మామూలే’.. నేను కాబట్టి మీకు తక్కువలో పనిచేసి పెట్టానంటూ తనకు తానే కితాబిచ్చుకునే ప్రయత్నం చేశాడు.



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ సిబ్బంది

15 కల్లా పొదుపు సంఘాల ప్రొఫైలింగ్ పూర్తి చేయాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో ఉన్న పొదుపు సంఘాల వివరాల నమోదును ఈ నెల 15 నాటికి పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పెజ్జోనిపేట, పూర్ణానందం పేట, హార్ట్ పేట, పప్పులమిల్లు ప్రాంతంలోని సచివాలయాలను సందర్శించి ఆర్పీలు చేస్తున్న ఆన్‌లైన్ ఎస్.హెచ్.జి ప్రొఫైలింగ్‌ను పరిశీలించారు. అనంతరం గులాబీ తోటలోని అన్న క్యాంటీన్‌లో వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ స్వయం సహాయక బృందాల సభ్యుల వివరాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం పెజ్జోనిపేటకు చెందిన మురళీకృష్ణ నివాసంలో సూర్య ఘర్ పథకంలో భాగంగా ఇన్‌స్టాల్ చేసిన సోలార్ ప్యానల్స్‌ను పరిశీలించారు. అన్న క్యాంటీన్‌లో కిచెన్‌లో పరిశుభ్రత, ఆహారంలో నాణ్యతను పరిశీలించారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పి. వెంకట నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయంలో స్వయం సహాయక బృందాల వివరాల నమోదును పరిశీలిస్తున్న ధ్యానచంద్ర

పరదాలమాటున ఆక్రమణలు

- చిక్కిపోతున్న బుడమేరు
- చోద్యం చూస్తున్న అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు మధ్య కట్ట ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్ సమీపంలో బుడమేరులో పరదాలమాటున యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పరదాల మాటున ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికే బుడమేరు లోపలికి చొచ్చుకుపోయి నిర్మాణాలు చేశారు. ఇటీవల బుడమేరు వరదల సమయంలో సైతం ఇక్కడ ఆక్రమణల వల్ల వరద నీరు నిలిచిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు పరదాలు ఏర్పాటు చేసి మరీ బుడమేరులోకి చొచ్చుకు వెళ్లి నిర్మాణాలు సాగిస్తున్నారు. అన్ని అనుమతులతో ఇళ్లు నిర్మించుకునే వారిని పీడించే అధికారులు ఇక్కడ ఆక్రమణలను పట్టించుకోకపోవటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుడమేరులో ఆక్రమణలను అడ్డుకోకుండే భవిష్యత్‌లో మరిన్ని ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పరదాల మాటున అక్రమ కట్టడాలు



బుడమేరులో ఏర్పాటు చేసిన పరదాలు